ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.12.12.24 సమయం.18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీ హీర్యా నాయక్ ను వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు.

2. అందుబాటులో ఉన్న PM మత్స్య సంపద యోజన నిధులను 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వినియోగించుకోవాలని రాష్ట్ర పశు , సంవర్థక శాఖ నిర్ణయించింది.

3. ఆర్టీసీ ఉద్యోగులలో సర్వీసు నిమిత్తం వివిధ కేసుల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

4. బాలామృతం తయారీలో వినియోగించే ముడిసరుకుల నాణ్యతలో లోపాలను సహించేది లేదని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హెచ్చరించారు.

**<u>లగచర్ల</u>**

లగచర్ల దాడి కేసులో రిమాండ్ ఖైదీ హీర్యా నాయక్ ను వైద్య పరీక్షల కోసం తీసుకెళ్లిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించారు. హీర్యా నాయక్ కు మెరుగైన చికిత్స అందించాలని, ఘటనపై పూర్తి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కేంద్ర కారాగారంలో లగచర్ల కేసులో నిందితుడిగా ఉన్న హీర్యా

నాయక్ ఈ ఉదయం అస్వస్థతకు గురి కావడంతో చికిత్స కోసం ముందుగా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్ కు తరలించారు.

డెస్క్

**నివేదిక**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలపై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందాలు తయారు చేసిన నివేదికను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఈరోజు అందజే సింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగ నిర్ధారణ పరికరాలు, ఫైర్ సేఫ్టీ, చికిత్సకు ఉపయోగించే ఔషధాలు తదితర అంశాలపై ఆరోగ్య శాఖ మంత్రి పది టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పలు ఆసుపత్రులను సందర్శించిన ఈ బృందాలు సమగ్ర నివేదికను తయారు చేశాయి. టాస్క్ ఫోర్స్ బృందాల అధికారులు తమ పర్యటనల్లో గుర్తించిన అంశాలను ఈ సందర్భంగా మంత్రికి వివరించారు.

డెస్క్

**పశుసంవర్థక శాఖ**

SNA-SPARSH ఖాతాలో అందుబాటులో ఉన్న PM మత్స్య సంపద యోజన నిధులను 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి వినియోగించుకోవాలని రాష్ట్ర పశు సంవర్థక శాఖ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ , చీఫ్ ఎగ్జిక్యూటివ్, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరా , రాష్ట్ర మత్స్య శాఖ అధికారులతో ఈ రోజు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో తెలంగాణ రాష్ట్రంలో మత్స్య సంపదను పెంచడానికి పలు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి రిజర్వాయర్ వద్ద 100% గ్రాంట్‌పై PMMSY-సెంట్రల్ సెక్టార్ పథకం 2024-25 కింద రూ.25 కోట్ల ఖర్చుతో ప్రత్యేకంగా కొర్రమీను చేపల పెంపకం కోసం ప్రతిపాదించారు. మత్స్య

శాఖకు సంబంధించి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకం కింద పెండింగ్‌లో ఉన్న అన్ని బీమా కేసులను పరిష్కరించాలని ప్రతిపాదించారు. మత్స్య సంపద అభివృద్ధి కార్యకలాపాల విస్తరణ కోసం రాజేంద్ర నగర్‌లోని NFDB కార్యాలయ భవనానికి ఆనుకుని అదనంగా 10 ఎకరాల భూమిని కేటాయించాలని NFDB అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.
పీఎన్.

**భద్రకాళీ చెరువు**

వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు పూడికతీత పనుల ను వేగంగా పూర్తి చేయాలని, పది శాఖల అధికారులతో కమిటీ వేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నీటిపారుదల , మైనింగ్, రెవిన్యూ, గ్రేటర్, KUDA, భూగర్భ జల శాఖ, మత్స్య శాఖ, పోలీస్ శాఖ, రవాణా శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయ లన్నారు. పది రోజుల్లో పూడికతీత పనులు ప్రారంభించేందుకు, పూడిక తీసిన మట్టిని వేలం పాట ద్వారా రైతులకు విక్రయించడానికి కావలసిన ఏర్పాట్లను సైతం చేస్తున్నారు.
వరంగల్ జిల్లా పి టి సి

సైన్స్ ఫెయిర్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసినట్లు మహబూబ్ నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ , ఇన్స్ ఫెయిర్ ప్రదర్శన కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ... పరిశోధనలు దేశ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

సౌండ్ బైట్...........

వివిధ రకాల అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

స్ట్రింగర్, మహబూబ్ నగర్

**పెద్దపల్లి ఎంపీ**

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఈరోజు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని కలసి, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా మంచిర్యాల , రామగుండం, పెద్దపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరు చేయాలని కోరారు. మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలు ఆగేందుకు అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. దీనికి సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి తగిన నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రయాణికుల కోసం మెరుగైన సేవలు అందుబాటులోకి రావడంతోపాటు, స్థానిక అభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

పెద్దపల్లి పీటీసీ

**ఆర్టీసీ త్రిసభ్య కమిటీ**

ఆర్టీసీ ఉద్యోగులలో సర్వీస్ నిమిత్తం వివిధ కేసుల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కార్మిక, ఉపాధి కల్పన ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ చైర్మన్ గా , ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ప్రజావాణి నోడల్ అధికారిణి దివ్య సభ్యులుగా ఈ త్రిసభ్య కమిటీ పనిచేయనుంది. ఆర్టీసీలో గతంలో నమోదైన ఉద్యోగుల సర్వీస్ తొలగింపు కేసులను ఈ కమిటీ పరిశీలిస్తుంది. ఇప్పటికే ప్రజావాణిలో ఈ విషయంలో నమోదైన ఫిర్యాదులను ఈ త్రిసభ్య కమిటీ విచారిస్తుంది.

పీఎన్

**బాలామృతం**

బాలామృతం తయారీలో వినియోగించే ముడి సరుకుల నాణ్యతలో లోపాలను సహించేది లేదని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను హెచ్చరించారు. టీజీ ఫుడ్స్ కార్పొరేషన్ పనితీరుపై మంత్రి సమీక్షిస్తూ అవతకతవకలపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ అధికారుల తీరు మార్చుకోవడం లేదని అన్నారు. అధికారులు పారదర్శకంగా , నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హెచ్చరించారు . టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించ వద్దని మంత్రి స్పష్టం చేశారు. అంగన్వాడి చిన్నారులకు సరఫరా చేసే బాలామృతం తయారు చేస్తున్న ఫుడ్ కార్పొరేషన్ పై ఎంతో బాధ్యత ఉందన్న మంత్రి నాసిరకం సరుకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు నోటీసువ్వాలని అధికారులను ఆదేశించారు.

పీఎన్

**<u>ఇందిరమ్మ ఇళ్లు</u>**

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్దిదారు గుర్తింపు ప్రక్రియ జిల్లాల్లో కొనసాగుతోంది. పొరపాట్లు లేకుండా లబ్దిదారుల గుర్తింపును నిర్వహించేందుకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా దరఖాస్తు దారుల వివరాలు, సంబంధిత పత్రాలను నమోదు చేస్తున్నారు. లబ్దిదారుల వివరాల నమోదులో ఎలాంటి త ప్పులకు ఆస్కారం లేకుండా సర్వే నిర్వహించాలని అసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. జిల్లాలోని బూరుగూడ గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... జిల్లా లో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

వికారాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ది దారును గుర్తించేందుకు చేపట్టిన సర్వే ను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిం చి, మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు.

పిటిసి ఆసిఫాబాద్/ స్ట్రింగర్ వికారాబాద్

**<u>ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు</u>**

సంగారెడ్డి జిల్లాలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కొత్తగా మంజూరైనట్టు జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి తెలిపారు. చౌటకూర్ మండలంలోని సుల్తాన్పూర్ , ఆందోల్ మండలంలోని సేరేడికుంట , జరాసంగం మండలంలోని బర్దిపురలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. ఒక్కో ప్రాథమిక కేంద్రాన్ని 2.45 కోట్ల రూపాయలతో నిర్మించనున్నారు. ఇటీవలే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ఆందోల్ మండలంలో 60 కోట్ల రూపాయలతో 150 పడకల ఆసుపత్రి , 43 కోట్ల రూపాయలతో నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతో సంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

పీటీసీ సంగారెడ్డి

**<u>సైకిళ్లు</u>**

రోటరీ క్లబ్ సహకారంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థినులకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినులకు రోటరీ క్లబ్ సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి రాజు , రోటరీ వరంగల్ సెంట్రల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**<u>ధరణి</u>**

ధరణి డేటాబేస్ అప్ గ్రేడ్ నేపథ్యంలో పోర్టల్ సేవలు ఈ రోజు నుంచి నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండవు. ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి వచ్చే సోమవారం ఉదయం వరకు ధరణి సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు.

పీఎన్